
విజయా వారి
సత్యహరిశ్చంద్ర
దర్శక నిర్మాత... కె.వి. రెడ్డి. B.Sc (HONS)

దానధర్మాది వ్రతాలలో సిద్ధులైన వారిని చెప్పవలెనన్న...ఒక్కొక వ్రతానికి పెక్కుమందిని చెప్పవచ్చును....

కాని జగదాధారమైన సత్యవ్రతమును, దృఢముగా పాలించి నిల్చిన ధీరుడు—నాటికీ నేటికీ హరిశ్చంద్రు డొకడే.

కనుకనే ఎన్ని యుగముల నుండియో, ఎన్నెన్ని విధములుగనో, ఎన్నెన్ని పర్యాయములో, ఎందరెందరి చేతనో స్మరింపబడుతూ, ఆ సత్య వీరుని చరిత్ర ప్రపంచ తారకమగుచున్నది.

సత్యబలము చేతనే సకల పీడిత ప్రపంచమూ సముద్ధరింపబడ గలదని చాటిన మహాత్ములకు సమధికోత్సాహ శక్తులను ప్రసాదించిన పుణ్యకథ....

సత్య హరిశ్చంద్ర

సంగ్రహంగా చెప్పాలంటే....

కృతయుగంలో భూమిని స్వర్గమొనర్చిన హరిశ్చంద్రుడు షట్చక్ర వర్తులలో ఒకడు.

దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయుచు, నిర్విఘ్నంగా నూరు రాజసూయ యజ్ఞములను చేసిన ఈ ధర్మమూర్తి చరిత్ర, కలకాలం, త్రిలోకాలకూ ఆదర్శప్రాయం కావలసిన విధి ఉండుటచేత, ముందు, మహేశ్వరుడు ఈతని త్యాగనిరతిని పరీక్షించుకొనినాడు.

తరువాత, ఇంద్రసభలో, వసిష్ఠ మహర్షితో వివాదపడి, హరిశ్చంద్రుని, సత్యమార్గమునుండి తప్పించెదనని విశ్వామిత్రుడు ఘోర ప్రతిజ్ఞను చేసినాడు.

ఇక విశ్వామిత్రుడు చేసిన కపటోపాయాలు చూడండి....హరిశ్చంద్రుని వద్దకు వెళ్ళి, అతడివ్వలేడనుకున్నంత ధనమును దానమడిగి, తీరా ఇస్తాననగానే....ఆ ధనము నతని వద్దనే దాచమని చెప్పి వెళ్ళిపోయాడు.

తరువాత కౄరమృగాలను సృష్టించి, హరిశ్చంద్రు నడవికి రప్పించాడు. అక్కడతనిని పరకాంతలకు చిక్కించిన, నతడు ధర్మ పత్నికి ద్రోహం చేసినవాడవుతాడని ఎత్తువేసి....మాతంగ కన్యల సృష్టించి, హరిశ్చంద్రునిపై ప్రయోగించాడు. వారికి లోబడని హరిశ్చంద్రుని బెదిరించి సర్వరాజ్యమునూ తనకు సమర్పించేట్టు చేశాడు. పైగా దాన మిచ్చిన ధనమునే అప్పుగా జమకట్టి....నెల రోజులలో ఆ అప్పు తీర్చునట్లు ఒప్పించి, తన శిష్యుని నక్షత్రకుని దరువుగానిగా పెట్టి—హరిశ్చంద్రుని రాజ్యం నుంచి వెళ్లకొట్టాడు.

ఇంక దారిలో హరిశ్చంద్రునికి దాపరించిన విశ్వామిత్రాలు చూడండి. విశ్వామిత్రుడు సృష్టించిన రాక్షసుడొకడు, వసిష్ఠుని రూపంలో వచ్చి హరిశ్చంద్రునికి దురుపదేశం చేస్తూనే తన మాయ నిలువక విఫలుడై పోయాడు. ఆలుబిడ్డ లాపదలో చిక్కినప్పుడైన హరిశ్చంద్రు డబద్ధమాడ గలడను అడియాసతో విశ్వామిత్రుడు దవాగ్నిని సృష్టించాడు. అది "మీ పేరులు మీవికావని చెప్తేనే దారి విడుస్తా" నంటూ హరిశ్చంద్రుని అందరినీ ముట్టడించింది. అప్పుడు చంద్రమతి అగ్నిదేవుని ప్రార్థింపగా ఆ ఆపద గడిచింది. కాశీకి రాగానే ముని ఋణం తీర్చేనిమిత్తం హరిశ్చంద్రుడు భార్యనమ్ముకోడానికి సిద్ధపడ్డాడు. కాని కొనగలవారు లేరైరి. అప్పుడు చంద్రమతి ప్రార్థింపగా కాశీవిశ్వనాధుడే కాలకౌశికుని రూపంలో వచ్చి చంద్రమతిని కొనడమూ, అసలు కాలకౌశికుని ఇంట చేర్చడమూ, తరువాత హరిశ్చంద్రుడు కూడ వీరబాహునికి అమ్ముడుపోయి కాటికాపరిగా స్థిరపడడమూ జరిగినాయి.

ఇక విశ్వామిత్ర ప్రేరణమున కర్కోటకుడు లోహితాస్యుని కరవడం, లోహితాస్యుని శవదహనానికి కూడా హరిశ్చంద్రుడు అనుమతించలేక పోవడం—చివరికి చంద్రమతినే రాజాజ్ఞచే, తల నరకవలసి రావడం— ఈ హృదయ విదారక ఘట్టాలలో ఏ మాత్రమూ చలించని హరిశ్చంద్రుని సత్యానికి మెచ్చి, ఈశ్వరుడు కథను సుఖాంతము చేయడమూ జరిగినది....



హరిశ్చంద్రుడు :

శ్లో॥ వందే సురాణాం సారంచ సురేశం నీల లోహితం
యోగీశ్వరం యోగ బీజం యోగినాంచ గురోర్గురుం.

జ్ఞానా నందం జ్ఞాన రూపం జ్ఞాన బీజం సనాతనం
తపసాం ఫలదాతారం దాతారమ్ సర్వసంపదాం.

మాతంగ కన్యలు :

నీవు మాకు చిక్కినావులే, రాజా —
మేము నీకు దక్కినాములే, రాజా —

సాహెూ వరాల రాజ — సాహెూ —
సాహెూ కుశాల రాజ — సాహెూ ॥

పైరు గాలికి పైట చెదరగ
పైట గాలికి గుండెలదరగ
నిలువలేక చేరినాములే, రాజా —
చేరి కోరి కేరినాములే రాజా — ॥ సాహెూ ॥

కోరచూపులు నీవు విసరగ
మరుని తూపులు మాకు తగులగ
తాళలేక సోలినాములే, రాజా —
సోలి తూలి వాలినాములే, రాజా — ॥ సాహెూ ॥

వయసు పొంగున వలపు విరియగ
మనసు మల్లెల వానకురియగ
ఆగలేక ఆడినాములే — రాజా —
ఆడిపాడి వేడినాములే — రాజా — ॥ సాహో ॥

హరిశ్చంద్రుడు :

వంశమును నిల్పు కొరకె వివాహమనుచు
అగ్నిసాక్షిగ పరిణయమాడినట్టి
ధర్మపత్నిని వీడి అధర్మనిరతి
ఈ అకార్యము నెపుడు నే చేయజాల —

చంద్రమతి :

అందాల తనయా — ఆనంద నిలయా
ఇనవంశమణి వీవెరా — దిన దినము వర్ధిల్లరా ॥

నను కన్న తండ్రీ నా నోము ఫలమా సుగుణాల విలసిల్లరా
తేజాలు మెరయా దానాలు కురియా
కళలూ సిరులూ నీవేరా ॥ దినదినము ॥

భువిలోని మునులూ దివిలోని సురలూ దీవింప చెలువొందరా
దేశాల నేలా ధర్మాలు నిలుపా
జయమూ యశమూ నీవేరా ॥ దినదినము ॥

హరిశ్చంద్రు డు:

నానా దేవ ధనంబులున్, ద్విజుల మాన్యంబుల్ వినా, భూరినం
స్థానైశ్వర్య సమేతమై వరలు మత్సామ్రాజ్య సర్వస్వమున్
దానం బిచ్చితి అష్టదిక్కులిన చంద్ర క్షోణులే సాక్షిగా
దానం బిచ్చితి ; విలుకొమ్మిక మునీంద్రా! కీర్తిసాంద్రుండవై —

నక్షత్రకుడు :

ఈశ్వరా జగదీశ్వరా ఏమి ఖర్మము పట్టెరా
ఎవరి కోపమొ ఎవరిపాపమొ నాకు తగులగ నేలరా ॥ ఈశ్వరా ॥

గారె బూరెలు చక్కిలాలూ ఆరగించే నిండు ప్రాణిని
కూడు లేక నీరు లేక అడవి పాలయి పోతిరా ॥ ఈశ్వరా ॥

చీకు చింతా లేక హాయిగ ఆశ్రమములో నుండు జీవిని
చండ భానుని ఎండ వేడికి కాగి కమలగ నేలరా ॥ ఈశ్వరా ॥

నిన్న రాజు నేడు బంటుగ ఉన్న వానినె లేని వానిగ
క్షణములోనె చేయగలిగిన మనుడవయ్యా దైవమా ॥ ఈశ్వరా ॥

చంద్రమతి :

శ్రీమన్మహా దివ్యతేజో విరాజీ
కృపాళూ జగజ్జాల రక్షా !
విశుద్ధ ప్రభామూర్తివై సర్వజీవప్రపంచంబునన్
ప్రాణకాంతుల్ ప్రసారింతువే !

లోకత్రయాధార సత్వప్రధానుండవై పొల్చుదేవుండవే !
ప్రాణికోటిన్ సదాధర్మమార్గంబు నందున్
ప్రవర్తింపగా చేయు దక్షుండవే ! జాతవేదుండవే !

దేవా ! ఈ లీల నీవే విజృంభించి
కోపార్చటిన్ జ్వాలికా జిహ్వలన్ చాచి
సర్వంబు భస్మంబుగావింప నున్నావే !

ప్రభూ ! నన్నె నీకాహుతిన్‌కాగ స్వీకారమున్ చేయుమా
భక్తులన్ బ్రోవుమా న్యాయమున్ చూడుమా
అగ్నిదేవా ! నమస్తే–నమస్తే నమః

హరిశ్చంద్రుడు, చంద్రమతి, లోహితాస్యుడు :

శ్లో॥ హే చంద్రచూడ మదనాంతక శూలపాణే!
స్థాణో గిరీశ గిరిజేశ మహేశ శంభో!
హే పార్వతీ హృదయవల్లభ చంద్రమౌళే!
భూతాధిప ప్రమథనాథ గిరీశ చాప!

నమో భూతనాథ — నమో దేవదేవ
నమో భక్తపాల — నమో దివ్యతేజా ॥

భవా వేదసారా — సదా నిర్వికారా
జగాలెల్లబ్రోవ — ప్రభూ నీవె కావా
నమో పార్వతీ వల్లభా! నీలకంఠా ॥ నమోభూత ॥

సదా సుప్రకాశా — మహాపాపనాశ
కాశీ విశ్వనాథా — దయా సింధు నీవే
నమో పార్వతీ వల్లభా! నీలకంఠా ॥ నమోభూత ॥

కాలకౌశికుడు, శిష్యులు :

వెనుక కాలమున నడచు కాలమున ముందు కాలమున
కాలాకౌశికూ ముందూ
తలయెత్తా గలవాడూ ఎవడూ వాడెవడూ ॥

లేని అప్పులు పుట్టించి అప్పుల వడ్డీ రెట్టించి
సందు చూచుకొని జుట్టును పట్టి
అందరి ఆస్తులు రాబట్టే ॥ కాలా ॥

చూచిన వాడొకడుంటే చూడని వారిని పదిమందిని చేర్చి
అబద్ధాన్ని నిజమనిపించి నిజాన్ని అబద్ధమనిపించి
తిమ్మిని బ్రహ్మినిచేసి బ్రహ్మని తిమ్మిని చెయ్యడంలో ॥ కాళా ॥

హరిశ్చంద్రుడు :

కలలోననైన నవ్వులకైన ఏ నాడు
అనృతంబు పలుకని అమల చరిత!

తనవారు పెరవారలను భేదమే లేక
ఎల్లరకృప నాదరించు సాధ్వీ!

తను మహారాణినే యనుమాట తలపక
భక్తితో సేవించు వరగుణాఢ్య!

ఉపకారశీలయై ఒరుల బాధలు చూడ
జాలని మానవతీలలామ!

నన్నెదైవమ్ముగా నమ్ముకొన్న పడతి
అట్టి నా ధర్మపత్ని నర్థాంగి నిపుడు
దేహమున అర్థభాగము తెగువ చీల్చి
ఇచ్చు విధమున నే విక్రయించుచుంటి;

చంద్రమతి :

సత్యమునకెందు భంగము జరుగువేళ
నీవెకద సర్వరక్ష! ఓ దేవ దేవ!
దాసిగా నన్ను కొనగల ధనికునొకని
చూపగదవయ్యా, మము దయచూడుమయ్యా!

వీరబాహు :

కులములో ఏముందిరా, సోదరా, మతములో ఏముందిరా —
మట్టిలో కలిసేటి మడిసీ మడిసీకి భేదం ఏముంది ఏముందిరా
॥ కులము ॥

నిలువు బొట్టుతో సొరగం రాదుర అడ్డ బొట్టుతో నరకం పోదుర
జుట్టూ బొట్టూ కట్టూలన్నీ పాడె కట్టుతో ఎగిరిపోవురా ॥ కులము ॥

జంగాలంతా శివుడేయంటరు దాసరులో కేశవుడే యంటరు
జంగము దాసరి జగడ మాడుకొని వల్లకాటిలో ఒకటై పోతరె
॥ కులము॥

తలకో మతముగ నీతులు గీతులు బోధలుచేసే స్వాములు చివరకు
కాటిరేడు యీ వీరబాహుని చేతిమీదుగా బూడిదౌతరే
॥ కులము ॥

వీరబాహునింట్లో నృత్యం :

ఆడ నీవూ యీాడ నేనూ
నూసుకుంటూ కూసుంటె
ఎన్నాళ్లు తాళగలను చందమామా
ఎన్నాళ్లు దాచగలను చందమామా ॥

నీలిరంగు పట్టుచీరె కట్టినాను
నల్లపూల తెల్ల రవిక తొడిగినాను
మల్లెపూల పానుపు పరచినాను
చల్లగా రావోయి తోటలోకి ॥ ఆడ నీవూ ॥

గిన్నె నిండ మంచి గంధం తీసినాను
సన్న జాజి పూల చెండ్లు గుచ్చినాను
వెన్నెల్లో ఏటికాడ వేచినాను
తిన్నగా రావోయి తిన్నెపైకి ॥ ఆడ నివూ ॥

కొప్పులోన మొగలిరేకు తురిమినాను
కప్పురంపు తాంబూలమేసినాను
జడివాన తలుపు తీయరాలేను ॥ ఆడ నీవూ ॥

నేపధ్య గీతం :

విధి విపరీతం విధి విడ్డూరం
విధి విలాస మన ఇదేకదా ॥
సప్త ద్వీప వసుంధర నేలిన
సార్వభౌముడగు హరిశ్చంద్రుడే
కాల కర్మమున కడకీనాటికి
కాటికి కాపరి ఆయెనా !
ఆ మహాత్మునికి అనుచరులిక యీ
భూతప్రేత పిశాచములా ! ॥ విధి ॥

దోసిళ్లతో రత్నరాసులే తరుగగా
దానాలు చేసిన ధన్యురాలు
ఆత్మసంతతివోలె అఖిల దీనజనాళి
ఆదరించిన దేవి అన్నపూర్ణ !
అట్టి చంద్రమతీదేవి అకటా యీనాడు
పట్టెడు కూటికే చెయిసాచ వలసి వచ్చె

వరుస సామంతరాజ వజ్రమకుటకాంతులన్
వరలు రాజేంద్రు దివ్యపాద పద్మయుగళమే
ఈ శ్మశాన వాటికలో బొమికలన్ పుఱ్ఱెలన్
ఒసలికొనుచు మసలికొనుచు నడువవలసివచ్చెనే ॥ విధి ॥

మేలిడోలికలోన ఊచి
లాలి పాటలు చెలులు పాడ
నిదురించు యువరాజె నేడు
నిదురించెనే కటికనేల !

చతురాశాంత పరీత సర్వధరణిన్ శాసింపగా రత్నరా
జిత దండంబు ధరించు రాజె కొరవిన్ చేదాల్చి శోధించుచున్
చితులన్ ద్రోయుచు రుద్రభూమి నరుదెంచెన్ ఎంత చిత్రంబహా !

మాయా ప్రపంచమె శాశ్వతమనుకొని
నా యిల్లాలని నా కుమారు లని
నాదీ నాది యని అల్లాడిన యీ
శరీర మిపుడీ వల్లకాటిలో
కాలిపోవువేళా అది
మట్టి కలియువేళ
ఇల్లాలేదీ – కుమారు లేరీ
జీవా నీకై ప్రాణమిచ్చినారా!
నీవెంట వచ్చినారా! ॥ విధి ॥

కాలకౌశికుని శిష్యులు :

తద్దినంపు భోజనం
తలచుకుంటె చాలురా
నోరూరు చుండెరా
ఒళ్ళు పులకరించురా ॥ తద్దినంపు ॥

అరటి చామ బీర కాకర
ఆవపెట్టిన పనసకూర
మెంతి పెరుగు పచ్చడిలో
నంచుకొంటు తింటుంటే ॥ తద్దినంపు ॥

దొప్పలోని నెయ్యినంతా
పప్పులోనె కలిపికొట్టి
ముద్దు ముద్దుగ అల్లం పచ్చడి
అద్దుకొంటు తింటుంటే ॥ తద్దినంపు ॥

తుంచకుండ గారె బూరె
మంచి తేనెలో ముంచుకొని
గొంతు జారవేయగానె
బ్రేవుమని త్రేపొస్తే ॥ తద్దినంపు ॥

హరిశ్చంద్రుడు :

వనితా ఏటికి బొంకజూచెదదిగో భాను ప్రభల్ చిమ్ముచున్
కనులన్ గ్రమ్మి అనర్ఘరత్నమణులన్ రాజిల్లు సత్భూషణం
బనిశంకన్ కలిగించె; అమ్ముకొనరాదా యిట్టి దుష్ప్రాప్తికిన్
మనమున్ గట్టిగ రాయిచేసుకొని నీ మాంగల్యమున్ మానినీ ॥

చంద్రమతి :

లోకబాంధవ! సర్వలోకైక వంద్య!
నాకు వేవేల జన్మములయందు
సతత పుణ్యుని హరిశ్చంద్ర భూవిభుని
పతిగ చేయగదయ్య ప్రాణేశునింక
ఆపదల్ బాపి కాపాడి సత్యంబు
దీపింప చేయుమా దేవ!

హరిశ్చంద్రుడు :

తాళికట్టిన చేత తరుణి కంఠము త్రుంచు
వింత యోగము నాకు విధి విధించె!
రవివంశ ధర్మమార్త త్రాణ శీలంబు
వదలి స్త్రీ హత్య సంప్రాప్తమాయె!
అనురాగ మణుమాత్రమైనను లేక నా
హృదయమ్ము మన శిలాకృతిని గాంచె!
ఎల్ల కర్మలు యిక ఈశ్వర ప్రీతికే
యని చింతవీడి ధైర్యము వహించి

సర్వ ధర్మార్థ కామమోక్షముల యందు
అర్ధ భాగినియైన అర్ధాంగి శిరము
కడకు ఖండించి నీ పాదకమలములకు
ఇదె సమర్పించెదను స్వీకరించు దేవ!

పాత్రధారులు

యన్. టి. రామారావు	....	హరిశ్చంద్రుడు
ముక్కామల	....	విశ్వామిత్రుడు
వి. నాగయ్య	....	వశిష్ఠుడు
రమణారెడ్డి	....	నక్షత్రకుడు
రేలంగి	....	కాలకౌశికుడు
రాజనాల	....	వీరబాహు
బాలకృష్ణ, నల్ల రామమూర్తి, రాజబాబు, రామకోటి	....	కాలకౌశికుని శిష్యులు
మాష్టర్ బాబు	....	లోహితాస్యుడు
యస్. వరలక్ష్మి	....	చంద్రమతి
గిరిజ	....	కలహకంఠి
ఎల్. విజయలక్ష్మి	....	మేనక
రాజశ్రీ, మీనాకుమారి	...	మాతంగ కన్యలు
వాణిశ్రీ	...	నర్తకి

టెక్నీషియన్లు

స్క్రీన్‌ప్లే	...	కె. వి. రెడ్డి, B. Sc., (Hons.)
కథ, మాటలు, పాటలు	...	పింగళి నాగేంద్రరావు
సంగీతం	....	పెండ్యాల నాగేశ్వరరావు
నృత్యం	....	పసుమర్తి కృష్ణమూర్తి
ఛాయాగ్రహణం	....	కమల్ ఘోష్
కళ	....	గోఖలే, కళాధర్

నిర్మాత – దర్శకుడు :

కె. వి. రెడ్డి, B. Sc., (Hons.)

స్టూడియో : **వాహిని**   నిర్వహణ : **విజయా**



వస్తున్నాడు

విజయా వారి

సి.ఐ.డి.

రామారావు · రంగారావు · రమణారెడ్డి

జమున · పండరీబాయి

డైరెక్షన్

చాణక్య

నిర్మాతలు

నాగిరెడ్డి · చక్రపాణి